పాడి రైతుకు భరోసా..
వైఎస్సార్ పశు బీమా



• పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివారావు

సాక్షి ఇంటర్వ్యూ

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం కొత్తగా వైఎస్సార్ పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇటీవల జీవో విడుదల చేసింది. ఈ పథకం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా పథకం ప్రయోజనాలు, దరఖాస్తు ఎలా చేసుకోవాలి, తదితర వివరాలను చినగదిలి మండలం(రూరల్) పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివారావు 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్రశ్న : వైఎస్సార్ పశు బీమా పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టారా?

ఏడీ : వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తోంది. గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం కంటే పాడి రైతుకు మరింత మేలు కలిగేలా ఈ పథకాన్ని రూపొందించారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) కింద దీన్ని అమలు చేస్తున్నారు.

ప్రశ్న : పాడి రైతుకు కలిగే ప్రయోజనాలేమిటి?

ఏడీ : ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఈ పథకం వర్తిస్తుంది. పాడి రైతులకు ఇది బాగా మేలు చేస్తుంది. ప్రమాదం వల్ల గానీ, సాధారణంగా గానీ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు చనిపోతే వాటికి నష్ట పరిహారం బీమా సంస్థ అందిస్తుంది. దీని కోసం ఆవు, గేదెకు రూ.30 వేలు, గొర్రె, మేకకు రూ.6 వేలు నష్ట పరిహారం అందుతుంది.

ప్రశ్న : బీమా ఎన్ని పశువులకు వర్తిస్తుంది?

ఏడీ : పాడి రైతులు తమ వద్ద పశువులకు బీమా చేయించుకోవాలి. ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఆవులు, గేదెలకు బీమా వర్తిస్తుంది. 50 గొర్రెలు, మేకల వరకు బీమా చేసుకోవచ్చు.

ప్రశ్న : బీమా చెల్లింపులెలా?

ఏడీ : రైతు తరపున బీమా ప్రీమియాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 80 శాతం వరకు చెల్లిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 40 శాతం చెల్లించగా రైతు 20 శాతం మాత్రమే చెల్లించాలి. ప్రీమియం కాల పరిధి మూడు సంవత్సరాలు. బిలో పావర్టీ లైన్(బీపీఎల్), ఎస్సీ, ఎస్టీలు రూ.384 చెల్లించాలి. ఎబౌ పావర్టీ లైన్(ఏపీఎల్) గల పాడి రైతులకు రాష్ట్రం 25 శాతం, కేంద్రం 25 శాతం రాయితీ కల్పిస్తున్నాయి. రైతు చెల్లించాల్సింది 50 శాతం అంటే రూ.920 చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్న : చినగదిలి మండలం(రూరల్)లో ఎన్ని పశువులు ఉన్నాయి?

ఏడీ : చినగదిలి(రూరల్) మండలంలో 2,780 పశువులున్నాయి. వాటిలో 1,587 ఆవులు, 1,193 గేదెలు ఉన్నాయి. వాటన్నింటికీ రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పుడు బీమా కోసం రైతులు వాటికి రిజిస్ట్రేషన్ చేయించుకుని, పాలసీ తీసుకోవాలి. ప్రభుత్వం కల్పించిన సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రశ్న : పశువులకు ఎంత వయసు ఉండాలి?

ఏడీ : ఆవులు, గేదెలు కనీసం ఒకసారి ఈని(దూడను కనాలి) ఉండాలి. వాటికి ఏడాదిన్నర వయసు నుంచి 10 సంవత్సరాలు వయసు మధ్యలో ఉండాలి. గొర్రెలు, మేకలకు ఆరు నెలలు వయసు దాటాలి.

ప్రశ్న : ఎప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు చేస్తారు?

ఏడీ : ఈ నెల 22వ తేదీ నుంచి బీమా కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం. పాడి రైతులు తమ పశువులకు బీమా చేయించుకోవచ్చు. నిబంధనల ప్రకారం పశువు చనిపోయిన 25 రోజుల్లో పరిహారం అందుతుంది. వైఎస్సార్ పశు బీమాతో రైతులు ధీమాగా ఉండడానికి ఆస్కారం కలుగుతుంది.



ఆవుకు ట్యాగ్ వేస్తున్న సిబ్బంది

ప్రశ్న : సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ఏడీ : పాడి పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఇప్పటికే టీకాలు వేశాం. రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి రాకుండా ప్రస్తుతం టీకాలు వేస్తున్నాం. చినగదిలి, ఎండాడ, మధురవాడ, అడవివరం, రుషికొండ తదితర ప్రాంతాల్లోని పశువులకు ఎక్కువగా టీకాలు వేశాం.

ప్రశ్న : వేసవి ఎండలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏడీ : ప్రస్తుతం వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నుంచి పాడి పశువులను కాపాడుకోవడానికి రైతులు జాగ్రత్తలు పాటించాలి. ఎండలో మేతకు విడిచిపెట్టకూడదు. ఆహారం పగటి సమయం కంటే రాత్రులు ఎక్కువగా ఇవ్వాలి. ఎక్కువగా చల్లని నీరు అందించాలి. చల్లని ప్రదేశాలలో ఉంచాలి. పగటి పూట మేత ఎక్కువగా తింటే వాటి శరీరం లోపల ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగులుతుంది. అందుకే రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి.

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఎంపిక



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జేకేసీ కో ఆర్డినేటర్ రాజశేఖర్

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఎంపికయ్యారని జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. కళాశాల కెమిస్ట్రీ విభాగం సహకారంతో నిర్వహించిన ఈ డ్రైవ్‌కు 84 మంది హాజరయ్యారు. వీరిలో 25 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ జాబ్ డ్రైవ్‌లో కళాశాల అధ్యాపకులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ అనురాధ, బి.వి. రాకేష్, ప్రజ్ఞ పాల్గొన్నారు.

స్కిజోఫ్రీనియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఏయూ క్యాంపస్: వరల్డ్ స్కిజోఫ్రీనియా డే సందర్భంగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రి వైద్యులు కె.వి.రామిరెడ్డి, యు.రాఘవరావు, జి.సురేష్‌కుమార్, పి.లోకేశ్వరరెడ్డి స్కిజోఫ్రీనియాకు గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న వైద్య చికిత్స తదితర విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీజీ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మద్దిలపాలెం : ఏపీ ఈపీడీసీఎల్ జోన్-1లో హెచ్‌బీ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-1 ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌బీ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని హెచ్‌బీ కాలనీ, చాకలిపేట, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్, ఆదర్శనగర్, సింహాద్రిపురం, వుడా అపార్ట్‌మెంట్స్, ఎల్ఐసీ ఆఫీస్, ఓల్డ్ ఏసీబీ ప్రాంతం, డాక్టర్స్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమి పూజ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉషోదయ కూడలి సమీపంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య బుధవారం భూమి పూజ చేశారు. టీటీడీ కూడలి నుంచి ఉషోదయ కూడలి వరకు రూ.29.50 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు రూ.16 లక్షలతో ఫుట్‌పాత్‌ను సైతం రోడ్డుకు ఇరువైపులా నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గేదెల నాగరాజు, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్సార్ నగర్‌లో జీవీఎల్ పర్యటన



ఏఎస్సార్ నగర్‌లో పర్యటిస్తున్న ఎంపీ జీవీఎల్, విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో బుధవారం ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల కోసం 2019లో 480 ఇళ్లకు శంకుస్థాపన చేశామని, ప్రస్తుతం 280 ఇళ్లే ఇక్కడ నిర్మించారని తెలిపారు. నాలుగేళ్లు గడిచినా ఇంకా ఇళ్లు కేటాయించక పోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తర కన్వీనర్ సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

28న 'ఘంటసాల జీవిత చరిత్ర' నాటకం

దాబాగార్డెన్స్: భారతదేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శ్రీభాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో ఆ రోజు సాయంత్రం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ నాటకం ప్రదర్శించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు, రాత్రి 7.30 గంటలకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని, ప్రదర్శనలకు రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు కళాభారతిలోనూ, రంగసాయి నాటక గ్రంథాలయం, సాయి బాదంగీర్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 94404 58458 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు ఎస్.నాగేశ్వరరావు, చంద్రశేఖర్, కుమార్‌రాజు, చినబాబు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధుడికి అంత్యక్రియలు

ఎంవీపీ కాలనీ: గత కొన్ని నెలలుగా 17వ వార్డు రెడ్ క్రాస్ సొసైటీలో ఆశ్రమం పొంది ఇటీవల మరణించిన జమ్మి బద్రినారాయణ అనే వృద్ధుడికి సొసైటీ ప్రతినిధులు, పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆరు నెలల క్రితం ఆశ్రయం లేక రైల్వేస్టేషన్‌లో ఉన్న నారాయణకు రెడ్ క్రాస్ ప్రతినిధులు 17వ వార్డులోని షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. అయితే ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 19న మరణించాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు, పోలీసులు హైదరాబాద్‌లో ఉంటున్న అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు నగరానికి వచ్చారు. దీంతో పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు రెడ్ క్రాస్ ప్రతినిధి మురళీ అప్పగించారు. అనంతరం నగరంలోని ఓ శ్మశానవాటికలో పోలీసులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.



వృద్ధుడి మృతదేహంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, పోలీసులు

నిర్వహణ సామర్థ్యం పెంచుకోవాలి

ఆనందపురం : మారుతున్న కాలానుగుణంగా నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవాలని బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ సీఈవో దత్తాత్రి సలగమే సూచించారు. మండలంలోని గంభీరంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవి)లో కొత్తగా ప్రారంభించిన ఈఎంబీఏ కోర్సులో చేరిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన బుధవారం మాట్లాడారు. కాలానుగుణంగా వస్తున్న భౌగోళిక, రాజకీయ, సాంకేతిక, శ్రామిక శక్తి తదితర మార్పులపై దృష్టి సారించాలన్నారు. నాయకత్వం వహించడానికి అవసరమైన సామర్థ్యాలు, నాయకత్వ విధానం, భాగస్వామ్య విలువలు, బహుళ నాయకత్వంపై వివరించారు. పరిశ్రమలు వేగవంతమైన మార్పులకు గురవుతున్నాయని, బాష్ సంస్థ పారిశ్రామిక దిగ్గజం స్థాయి నుంచి టెక్నాలజీ మేజర్‌గా ఎలా రూపాంతరం చెందిందో వివరించారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పనిచేసే నిపుణులకు ఉన్నతమైన మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ సంస్థ ప్రభుత్వ - కార్పొరేట్ సంబంధాల అధికారి వీరారెడ్డి ద్వారంపూడి, మొబిలిటీ సొల్యూషన్స్ మేనేజర్ మనోజ్ ఎక్కుండి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ హ్యాపీ పాల్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ చైర్‌పర్సన్ ప్రీతివిర్ది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న దత్తాత్రి సలగమే

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన ఈ స్టేషన్‌ను సందర్శించి పలు ఫైళ్లను పరిశీలించారు. మహిళలు, వృద్ధులు పిల్లలకు సంబంధించిన కేసులపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ నేరాల్లో అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సీపీ వెంట డీసీపీ-2 ఆనందరెడ్డి, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్.వి జయ్‌కుమార్, ఎస్ఐలు రవికిషోర్, షేక్ సమీర్, క్రైం ఎస్ఐ సునీల్, ఏఎస్ఐలు సతీష్, పాపారావు, సిబ్బంది ఉన్నారు.



కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బీచ్ రోడ్డు: వుడా పార్క్ ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 52 ఏళ్ల వయస్సు గల వ్యక్తి వుడా పార్క్ ఫుట్‌పాత్‌పై కదలకుండా ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆయనను పరిశీలించగా మృతిచెందినట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు యాచకుడు అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని గుర్తిస్తే మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామారావు కోరారు.



మృతదేహం

ద్విచక్ర వాహనాలకు వేలం నేడు

ఎంవీపీ కాలనీ: పలు కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం వేలం వేయనున్నట్టు ఎస్ఈబీ సీఐ జగదీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపై ఆసక్తి ఉన్న వారు ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 167 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరు అయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 17 మంది హాజరు కావాల్సి ఉంది. అయితే ఒక విద్యార్థి గైర్హాజరు కావడంతో 16 మంది పరీక్ష రాశారని నాగమణి తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

27న పెయింటింగ్ పోటీలు


సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ×బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్¨ అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 7 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 15 ఏళ్ల వయసు వారికి వేర్వేరుగా పోటీలు ఉంటాయని వివరించారు. రెండు విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ. 2 వేలు, వెయ్యి రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు 81214 81452 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అలరించిన కథా కచేరి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్ర నగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరి అందరినీ అలరించింది. ముందుగా ఇటీవల పరమపదించిన ప్రముఖ రచయిత కేతు విశ్వనాథ రెడ్డి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. సభకు అధ్యక్షత వహించిన రచయిత శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రచయితలు మానవ జీవన మనస్తత్వాలు మానవీయ విలువలు, కథల్లో చూపించి ఉదాత్తమైన రచనా శైలితో కథలు అందించాలని సూచించారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చెడును ప్రక్షాళన చేయాలన్నారు. రచయిత కె.జి.వేణు ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రచించిన 'వర్షం కురిసిన రాత్రి' కథానికను చక్కగా విశ్లేషించారు. రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన్న సూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరి రమణ, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు తమ రచనలు వినిపించారు.



మాట్లాడుతున్న రచయిత శేఖరమంత్రి ప్రభాకర్

ఏయూ సమాచారం..

అవార్డు గ్రహీతకు అభినందన

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవ వైవిధ్య పరిరక్షక పురస్కారాన్ని సాధించిన డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం ఉదయం తన కార్యాలయంలో అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు గత రెండు దశాబ్దాలుగా కీర్తి చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ డే ఫర్ బైలాజికల్ డైవర్సిటీ 2023లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. అభినందన కార్యక్రమంలో కె.జానకీరావు, సిహెచ్.మధుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కీర్తిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

కర్రసాములో చిన్నారుల ప్రతిభ

దాబాగార్డెన్స్: కర్రసాము పోటీలో విశాఖ చిన్నారులు ప్రతిభ చూపారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు చెన్నై కోయింబత్తూరులో సిలంబమ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కె.కుశ్వంత్‌కుమార్ బంగారు పతకం, కె.సుప్రియ, ఎస్.వినయ్ ఈశ్వర్, ఎ.లక్ష్మీనారాయణ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కోచ్ ఎస్.శ్రీనివాసరావు వద్ద తర్ఫీదు పొందిన వీరంతా ఇప్పటి వరకు పలు పతకాలు గెలుపొందారు. త్వరలో విశాఖలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. కర్రసాముకు పుట్టినిల్లు చెన్నైలోనే మన రాష్ట్రం విశాఖ నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని విజయం సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. విశాఖకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్‌లో నిర్వహించిన అభినందన సభలో పతకాలు సాధించిన చిన్నారులను ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లిపిల్లి ఎల్లాజీ అభినందించారు.



కర్రసాము పోటీల్లో పతకాలు సాధించిన విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు

అత్యవసర పనులకు ప్రాధాన్యం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



జీవీఎంసీ కమిషనర్‌కు సాయికాంత్ వర్మకు శివాజీ పార్కు సమస్యలు వివరిస్తున్న వాకర్స్



బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం జోన్-3, 5ల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కైలాసపురం, సాలిగ్రామపురం, డీఎల్బీ క్వార్టర్స్, అయ్యప్పనగర్, శ్రీనివాస నగర్, ఏఎస్సార్ నగర్, మురళీనగర్, మాధవధార తోపాటు శివాజీ పార్కు, బీచ్ రోడ్డులోని స్విమింగ్ పూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులతోపాటు వీధి రోడ్లలో పారిశుధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. చాలా చోట్ల వీధులు, రహదారులపై వ్యర్థాలు కనిపిస్తున్నాయని, ఆయా సచివాలయ పరిధిలోని శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

శివాజీ పార్కు సందర్శన..

శివాజీ పార్కును కమిషనర్ సాయికాంత్ వర్మ సందర్శించారు. మరుగుదొడ్లు, నడక మార్గం, తాగునీరు, విద్యుత్ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని ఆయనను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కమిషనర్ స్పందిస్తూ అత్యవసర పనులు త్వరితగతిన చేపట్టేందుకు టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పనులు పరిశీలించారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని, స్విమ్మింగ్ సామగ్రి అంతా సమకూర్చుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డీడీహెచ్ దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు దల్లైవారి వీధిలో కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, కార్పొరేటర్ గేదెల లావణ్య శంకుస్థాపన చేశారు. రూ.48 లక్షల వ్యయంతో స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ కల్యాణ మండపాన్ని నిర్మించి అందుబాటులోకి తేనున్నట్లు అక్కరమాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పోలమాంబ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ శంకరరెడ్డి, కనకమహాలక్ష్మీ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు నందూరి సుబ్రహ్మణ్యం, లక్ష్మణరెడ్డి, రమణారెడ్డి, కంద్రపు రామారావు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

మర్రిపాలెం: ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు మాధవధారలోని ఎంఎన్ఆర్ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మాధవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుకున్న విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మెంటర్ హెచ్. వి.రమణ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26 లోపు ఎంఎన్ఆర్ గ్రంథాలయంలో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉక్కు ఉద్యమం మార్గదర్శకం కావాలి



832వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోమని, కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కావాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బోండా తొడన్న అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 832వ ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలకొండ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు, కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం, గణేష్, పైడి కొండలరావు, ఫణీంద్రబాబు, వేణుగోపాలరావు, మోహన్‌బాబు, పుల్లారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.